
# వైపరీత్యం - కొండా కుసుమకుమారి



ఆకాశం మేఘావృతమైంది.

వాన సూచనగా చలిగాలి వీస్తోంది.

అప్పుడప్పు డొక మెరుపు మెరుస్తూ, ఉన్నట్లుండి ఉరుముతోంది ఆకాశం.

వసారాలో వాలు కుర్చీలో కూర్చున్న శాంతమూర్తి మాస్టారు ప్రకృతిలో మార్పును గమనిస్తూ ఆకాశం వైపు దృష్టి సారించారు.

ఎందుకో ఆయన గుండె కూడా వానచినుకు కోసం ఎదురుచూసే బీటలు వారిన నేలలా ఉంది.

వానజల్లు పూల జల్లులా నేల తల్లి గుండెను తాకుతుందో, పెనుతుపానై ప్రళయకాల ప్రభంజనంలా ముంచెత్తుతుందో ఎవరికి తెలుసు! అయినా నిరీక్షించక తప్పదు కదా అనుకొన్నారు.

సమీర వంట చేస్తోందన్న మాటే కాని, ఒక చోట కాలు నిలువనట్లు ఇంట్లోకీ, వసారాలోకీ తిరుగుతూ చూపులు తలవాకిట నిలిపింది. కర్ర గేటు చప్పుడు కోసం, మెత్తని అడుగుల సవ్వడికోసం చెవుల్ని జారగిలపెట్టింది.

తరుముకొస్తున్న కారు మబ్బుల్ని చూస్తూ 'వా నొచ్చేలా ఉంది నాన్నా!'' తండ్రివైపు చూసింది.

శాంతమూర్తి మాస్టారు ఏదో సమాధిలో ఉన్నట్లు మౌనంగా ఉండిపోయారు.

తండ్రిని ఆ స్థితిలో చూస్తుంటే సమీరకు గుండె మరింత బరు వెక్కిన ట్లనిపించింది.

చూస్తుండగానే టప టప చినుకులు రాలడం మొదలై రివ్వున గాలి వీచసాగింది.

"జల్లు కొడుతుందేమో! లోపల కొచ్చి కూర్చో నాన్నా!"

"ఫరవాలే దమ్మా!"

"అయినా ఇక్క డెందుకు? గాలి ఎలా వీస్తోందో చూడండి."

"శశాంక కోసం చూస్తున్నా నమ్మా!"

సమీర కళ్ళలో గిర్రున నీరు తిరిగింది. "తప్పకుండా వస్తాడు నాన్నా! శశాంక మీద నా కా నమ్మక ముంది. అతడి మనసు నాకు తెలిసినంతగా మ రెవరికీ తెలియదు."

"నాకూ ఆ నమ్మకం ఉందమ్మా! అందుకే అతడి కోసమే ఎదురుచూస్తున్నాను." గాజు పూసల్లా జారుతున్న నీటి ధారల్లోకి చూస్తూ అన్నారు.

అసుర సంధ్యావేళ.

బారులుతీరి గూళ్ళకు మరలుతున్న పిట్టలతో తెలిమబ్బులతో అరుణార్ణవమైన ఆకాశం చిత్రపటాన్ని స్ఫురింపజేస్తూంది.

పల్లె అంచున ప్రశాంత వాతావరణంలో పర్ణశాలలా ఉన్న ఆ చిన్న కుటీర ప్రాంగణంలో మొక్కలకు పాదులు చేస్తూ నీళ్ళు పెడుతున్నారు శాంతమూర్తి మాస్టారు.

స్కూలు నుండి రాగానే కాస్తంత సేదతీరి తోట పనిలోకి దిగడం ఆయన నిత్యకృత్యం. పిల్లల పట్ల చూపించే ప్రత్యేక శ్రద్ధ మొక్కల సంరక్షణలోనూ కనబరచడం సమీరకు ఆశ్చర్యంగా ఉంటుంది. తండ్రికి సాయంగా తనూ తోట పని చేస్తూ, నూతిలో నీళ్ళు తోడుతూ కబుర్లు చెబుతుంది.

విచ్చలవిడిగా ఎదిగి గాలిలో ఊగుతున్న మల్లెతీగల కొక ఆలంబన నేర్పరుస్తున్న మాస్టారు కర్రగేటు చప్పుడుకు తిరిగి చూస్తూనే చకితు లయ్యారు.

ఆ ఊరి మోతుబరి రైతూ, ప్రెసిడెంటూ అయిన భూపతిగారు గేటు తీసుకొని లోపల కొస్తూనే చేతులు జోడించి నమస్కరించారు.

సంభ్రమంతో ఎదురెళ్ళి - "రండి భూపతిగారూ! మీ రాకతో మా కుటీరం పావనమైం దనుకుంటాను. రండి" అంటూ ఆహ్వానించి, కుర్చీ చూపించారు.

భూపతిగారు కూర్చోకుండా ఏదో చెప్పా లన్నట్లు మాస్టారి రెండు చేతులూ పుచ్చుకొన్నారు. ఎప్పుడూ గాంభీర్యాన్ని సంతరించుకొని ఉండే ప్రెసిడెంటుగారి మోములో ఏదో వేదన ప్రస్ఫుట మవుతోంది.

"మాస్టారూ! మీతో ఒక ముఖ్యమైన పని ఉండి వచ్చాను. మా శశాంక గురించి మీకు తెలిసే ఉంటుంది. ఒక్కగా నొక్క బిడ్డ అని గారాం చేస్తే అక్షరం ముక్క వంటబట్టకుండా పోయింది. పైగా రాలుగాయి వెధవలతో చేరి చెట్టూ పుట్టా పట్టుకొని తిరగడం మొదలుపెట్టాడు. పెద్ద చదువులు చదివి, మంచి నడవడికతో వంశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావలసిన వాడు ఎందుకూ పనికిరాకుండా భ్రష్టుపట్టుకుపోతా డని భయంగా ఉంది. దయచేసి వాడి నెలాగైనా మీరే ఒక దారికి తీసుకురావాలి మాస్టారూ! విద్యా బోధనలోనే కాక పిల్లల క్రమశిక్షణా బాధ్యత పట్ల కూడా మీ సామర్థ్యం తెలిసిన వాడిని కనుక ప్రత్యేకించి వాడిని మీకే అప్పగించాలని వచ్చాను" అన్నారు.

మాస్టారు చిరునవ్వుతో - "ఈపాటి దానికి మీ రింత బాధపడాలా భూపతిగారూ! ఆకతాయి వయసు. నాలుగు రోజులు పోతే మంచీ-చెడూ తనకే తెలుస్తుంది. మీరు నిశ్చింతగా ఉండండి. మీరు చెప్పినా, చెప్పకపోయినా వృత్తిరీత్యా శశాంక బాధ్యత నాదే" అంటూ ధైర్యం చెప్పారు.

.భూపతిగారికి కొండంత బలం వచ్చినట్లయింది.

"ఈ ఒక్క మాట మానసిక వ్యథతో క్రుంగిపోతున్న నాకు ఎంతో శక్తి నిచ్చిన ట్లనిపిస్తుంది మాస్టారూ! నిజంగా వాడిలో మార్పు వచ్చి ప్రయోజకుడు కాగలిగితే మాకు కావలసిం దేముంది? అంతకంటే గొప్ప అదృష్టం ఈ జీవితానికి ఉండదు. అది మాకు మీరే ఇవ్వగలరు మాస్టారూ!" అంటూ మరి మరి వేడుకొంటూ సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

శశాంక గురించి మాస్టారికి బాగా తెలుసు.

డబ్బు అహంతో, స్నేహితుల అండతో చెలరేగిపోవడం చూస్తూనే ఉన్నారు. పైగా మందలించబోతే మరింత దూకుడుగా తయారయ్యే తత్వం అతడిది. మంచితనంతో ఆకట్టుకోబోతే అలుసుగా తీసుకొని ఆటలు పట్టించే నైజం. అందుకే స్కూల్లో మిగిలిన ఉపాధ్యాయులు అతడి నెప్పుడో గాలికి వదిలేసి నిశ్చింతగా ఉంటున్నారు. కాని శాంతమూర్తి మాస్టారు మొదటినుండీ ఓ కంట అతడిని గమనిస్తూ, వీలయినప్పుడల్లా అతడి చుట్టూ ఆవరించుకొన్న అజ్ఞానపు చీకట్లను పారద్రోలడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆ ప్రయత్నంలో భంగపడిన సందర్భాలూ ఉన్నాయి. అయినా తన బాధ్యతను ఆయన ఎన్నడూ విస్మరించలేదు. ఇప్పుడు భూపతిగారి అభ్యర్థనతో ఆ బాధ్యత మరింత పెరిగిన ట్లనిపించింది.

“మీ కెందుకు నాన్నా లేనిపోని శ్రమ. కుక్క తోక ఎంత సాగదీసినా వంకరే.” ప్రెసిడెంటుగారు వెళ్ళిపోయాక సమీర అంది.

మాస్టారు నొచ్చుకున్నట్లు చూశారు. “తప్పు సమీరా! క్లాసులో పిల్ల లందరి పట్ల గురువుకు బాధ్యత ఉంటుంది. ఇటువంటి పిల్లల పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువవుతుంది. అలా లేకపోతే వృత్తికే కళంకం ఆపాదించినవాడి నవుతాను.”

సమీర మరి మాట్లాడలేదు. తండ్రి గురించి తెలిసీ తొందరపడినందుకు తనను తాను నిందించుకొంది.

** ** **

పనిగట్టుకొని శాంతమూర్తి మాస్టారు తన విషయంలో జోక్యం కలుగజేసుకోవడం బొత్తిగా నచ్చని శశాంక మరింత అల్లరి మొదలుపెట్టాడు. క్లాసులో అతడు చేసే ఆగడానికి హద్దూ పద్దూ లేకుండాపోయింది.

ఒకసారి హిస్టరీ క్లాసు జరుగుతుండగా వెనక బెంచీమీద చేరి విపరీతమైన అల్లరి మొదలుపెట్టాడు. మాస్టారు ఒకటి రెండుసార్లు హెచ్చరించినా ప్రయోజనం లేకుండాపోయింది. వంతపాడే స్నేహితులతో చేరి మరింత ఆగడం చేస్తూ పిల్లి కూతలూ, కుక్క అరుపులతో క్లాసు జరగనివ్వకుండా చేస్తున్నాడు.

మిగతా విద్యార్థులలో అసహనం పెరిగిపోవడం గమనించిన మాస్టారు శశాంక దగ్గర కొచ్చారు.

నిర్లక్ష్యంతో క్రాపు సవరించుకొంటూ ఎటో చూస్తున్న అతడిని చిరునవ్వుతో పిలిచారు - “శశాంకా! ఈ వయసు మీది. అలాగే ఇప్పటి కాలమూ మీది. ఎంతైనా అల్లరి చేసుకోవచ్చును. ఆడీ పాడవచ్చును. కాని కొంతమంది స్టూడెంట్లు మాత్రం కేవలం చదువుకోసమే స్కూలుకు వస్తారు. వాళ్ళవలన నీకు ఇబ్బంది కలుగకూడదని నేనే వాళ్ళను తీసుకొని బయటకు వెళ్ళిపోవా లనుకొంటున్నాను” అంటూ, మిగిలిన పిల్లల వైపు తిరిగి - “లెసన్ వినా లనుకొనేవారు మాత్రం నాతో రండి. సరదాగా కాలం గడపా లనుకొనేవారు శశాంకతో పాటు ఎంజాయ్ చెయ్యండి” అంటూ కాంపౌండులో నున్న చెట్ల



## ఎక్కడ వేశావు?

ఎప్పుడూ బస్‌లోంచి వళ్ళ తొక్కలు బయటికి విసిరేసే కొడుకుతో తల్లి - “గుడ్! ఈ రోజు తొక్కలు బయటకు విసిరేయలేదు. వాటిని జాగ్రత్తగా ఉంచితే బస్సు దిగిన తర్వాత చెత్తకుండీలో వేద్దాం” అంది.

“వాటిని పక్కాయన జేబులో వేశానే అమ్మా!” గొప్పగా చెప్పా డా గడుగ్గాయి.

కె. వెంకటరామ అక్కయ్య [పామర్రు]

కిందికి నడిచారు.

నలుగురైదుగురు మినహాయించి మిగిలిన పిల్లలంత మాస్టారి వెనకే బిల బిల మంటూ సాగిపోయారు.

తన ఆగడానికి హద్దు లేదనుకొన్న శశాంక హతాశు డయ్యాడు. కొంతసేపటివరకూ నోరు పెగల్లేదు. క్లాసు రూంలో కూర్చోలేక, బయట మాస్టారి దగ్గరకు వెళ్ళలేక అ దో లాంటి ఇబ్బంది ఫీలయ్యాడు.

అలా అవకాశం వచ్చినప్పుడల్లా మాస్టారు అతడి నావరించుకొన్న మూర్ఖత్వాన్ని వదలగొట్టడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.

స్వతహాగా శశాంక తెలివైన వాడని మాస్టారు గ్రహించారు. కాకపోతే డబ్బు గల వాడినని అహంభావంవలన, వందిమాగధుల్లాంటి తోడి కుర్రాళ్ళవలన తనను తానే మరచి విశృంఖల ధోరణికి అలవాటుపడ్డాడు. సహనంతో వ్యవహరిస్తే దారి కొస్తా డనే నమ్మకం కలిగింది.

ఆ రోజు శాంతమూర్తి మాస్టారు స్కూల్లో అడుగు పెడుతూనే ఉలిక్కిపడ్డారు.

కాంపౌండులో ఒక పక్కన మరో ఇద్దరితో చేరి సిగరెట్టు కాలుస్తూ కబుర్లు చెబుతున్నాడు. మాస్టారి దృష్టి పడిందని తెలుసుకొన్నాక మరింత నిర్లక్ష్యంతో రింగులు రింగులుగా పొగ వదులుతూ స్టైయిలుగా నిలబడ్డాడు.

మాస్టారు తిన్నగా వాళ్ళ దగ్గరకు నడిచారు.

“శశాంకా!” తీవ్రంగా పిలిచారు.

అరమోడ్చిన కళ్ళతో ఓరగా చూస్తూ - “మాస్టారూ! మీ డ్యూటీ పిల్లలకు పాఠాలు చెప్పడం వరకే. అంతకు మించి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకొంటే బావుండదు” అన్నాడు వార్నిం గిస్తున్నట్లుగా. పక్కనున్న వాళ్ళు కోరగా చూశారు.

మాస్టారికి న వ్వొచ్చింది - “వ్యక్తిగత జీవితమా! జీవితమంటే ఒక వస్తువు కాదు నీ ఇష్టం వచ్చినట్లు ఆడుకోవటానికీ, వాడుకోవటానికీ. జీవితమంటే ఒక పయనం. ఆ పయనంలో ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాట. కొన్ని మార్గాలు రాళ్ళు ముళ్ళూ లాంటి అవరోధాలతో సుగమంగా లేకపోయినా, ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది. కొన్ని పూల బాటలుగానే, పాలరాతి మెట్లుతోనే ఉన్నా అగాధాల్లోకి తీసుపోతుంది. నీ జీవిత పయనంలో నువ్వు ఎన్నుకొన్న బాట సుఖవంతమైన పూల తెప్ప లాంటిది. అది ఏ అగాధాల్లోకి చేర్చుతుందో ఎవరికీ తెలియదు. కాకపోతే చెడ్డ అలవా ట్లెప్పుడూ సుఖవంతమైనవేనని గుర్తుంచుకోండి” అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.

ఆ రోజంతా మాస్టారి మనసు ప్రశాంతంగా లేదు. ఏదో అలజడితో కలతబారిన ట్లయింది.

భూపతిగారి కిచ్చిన మాట నిలబెట్టుకోలేని వాడి నవుతానా అనుకొని మధనపడ్డారు.

కాని చిత్రంగా ఆ తరువాత శశాంక ఎప్పుడూ సిగరెట్టు తాగుతూ కనిపించలేదు. కాకపోతే అల్లరి, ఆగడం మాత్రం తగ్గలేదు. అది కొంతవరకు మేలే అనుకొని ఓపిగ్గా భరిస్తూ, సహనంతో వ్యవహరించసాగారు. క్లాసులో పాఠాలే కాకుండా సత్ప్రవర్తన గురించి నీతిబోధ చేస్తూ మహనీయుల జీవిత చరిత్రను కథలుగా చెబుతూ ఆకట్టుకోసాగారు.

ఒకసారి ‘వీరోచిత ప్రదర్శన’ అన్నట్లు మాస్టారు పాఠం చెబుతుండగానే ముందు బెంచీమీద కూర్చున్న సమీర జడ పట్టుకొని గుంజాడు.

ఘొల్లుమని నవ్వులు చెలరేగాయి.

సమీర మొహం ఎర్రగా కందిపోగా కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

క్షణం మౌనంగా ఉండిపోయి తరువాత శశాంక దగ్గర కొచ్చారు. ఎప్పటి లాగే ప్రశాంతంగా ఉంది ఆయన వదనం.

ఏమీ తెలియని వాడిలా అమాయకంగా చూస్తూ కూర్చున్న శశాంకతో - “శశాంకా! నీకు చెల్లెళ్ళు లేరనుకుంటాను. అందుకే సమీర పట్ల నీ కంత అభిమానం. ఫరవాలేదు. ఇంట్లో అయితే మాత్రం అక్క చెల్లెళ్ళతో ఈపాటి అల్లరి చెయ్యవా! ఇదీ అంతే” అంటూ సమీర దగ్గర కొచ్చారు.

అవమానభారంతో తల వాల్చుకొని కూర్చుంది.

“దీనిలో బాధపడవలసిం దేముం దమ్మా! మీ అందరి మధ్యన ఉండే సోదర భావాన్ని పురస్కరించుకొని ఈపాటి అల్లరి చేస్తూ చనువుగా ఉండటంలో అసహజం ఏమీలేదు. మీరంతా ఒకే గూటి పక్షుల్లాంటి వాళ్ళు. ఒకే తల్లి పిల్లల్లాంటి వాళ్ళు. స్నేహభావం తప్ప శత్రుత్వం మీ మధ్యన ఉండదు. ఈమాత్రం చిలిపితనం ఉండటంలో దోష మేమీలేదు” అన్నారు.

ఏదో గొడవ జరుగుతుం దనుకొన్న శశాంక నివ్వెరపాటుతో చూశాడు. ఎప్పుడూ తన అంచనాను మించిపోయి ఉండే మాస్టారి కేసి నిర్నిమేషంగా చూస్తుండిపోయాడు. ఎక్కడో మనసు లోతుల్లో సన్నని అలజడి చెలరేగిన ట్లనిపించింది.

ఆ సాయంత్రం ఇంటి దగ్గర చదువులో వెనకబడిన పిల్లలకు ప్రత్యేకించి క్లాసు తీసుకొంటున్న మాస్టారు గేటు తీసుకొని మెత్తని అడుగుల సవ్వడితో లోపల కొస్తున్న శశాంకను ఆశ్చర్యంతో చూశారు.

“రావోయ్ శశాంకా! రా. ఇక్కడైతే ఎంతైనా

అల్లరి చెయ్యచ్చును. నిన్ను కాదనేవా ళ్ళెవరూ లేరు. ఇదిగో, నీకు తోడు కావాలనుకుంటే వీళ్ళను కూడా పిలువు" అంటూ లోపలకి చూస్తూ - "సమీరా! ఎవ రొచ్చారో చూడు" అంటూ పిలిచారు.

తల వాల్చుకొని నిలబడిన శశాంక గొంతు, పెగుల్చుకొని నెమ్మదిగా - "క్షమించండి మాస్టారూ!" అన్నాడు.

"అరె, క్షమాపణవరకూ దేనికయ్యా! పొద్దుట చెప్పాను కదా ఆమాత్రం చిలిపిదనం ఉండటంలో దోషం లేదని. రా. వచ్చి కూర్చో!"

తండ్రి పిలుపుతో బయటకు వచ్చిన సమీర అతడిని చూస్తూనే పెదవి కొరుక్కొంటూ గిరుక్కున తిరిగి వెళ్ళబోయింది.

"సమీరా!" మాస్టారు మందలింపుగా పిలిచారు. "ఇంటికి వచ్చిన వాళ్ళను పలకరించకపోవడం సంస్కారం కాదు."

ఆగి అతడివైపు చూసింది. ఆ చూపు నిలదీసిన ట్లనిపించింది.

"జరిగిన దానికి బాధపడుతున్నాను సమీరా! మాస్టారు గొప్ప మనసుతో నన్ను మన్నించినా నా మనసు మాత్రం నన్ను పట్టుకొని పీడిస్తూ ఇక్కడి కొచ్చేవరకూ నన్ను నిలువనీయలేదు. ఎందుకో ఇప్పుడు నా మనసు చాలా ప్రశాంతంగా ఉం దనిపిస్తుంది. కారణం ఈ ప్రాంగణంలో అడుగు పెట్టడమేనేమో!" అన్నాడు.

సమీర రెప్ప వేయడం మరచి ఆశ్చర్యంతో చూసింది.

శశాంక చాలాసేపు వసారాలో మాస్టారికి చేరువగా మిగిలిన పిల్లలతో పాటు కూర్చున్నాడు.

ఊరికి చివరగా ఉన్న ప్రశాంత వాతావరణంలో ముని వాటికలా ఉన్న కుటీరం, పూల మొక్కలతో, లతలతో నిండిన ప్రాంగణం, పుష్ప సుగంధాలతో కూడిన చల్లని గాలి అతడిలో తెలియని ఒక పవిత్ర భావాన్ని కలిగించగా మరో లోకంలో ఉన్న వాడిలా మౌనంగా ఉండిపోయాడు.

వెళ్ళేముందు చెప్పారు - "ను వ్వెప్పుడు రావా లనుకుంటే అప్పుడు నిరభ్యంతరంగా ఇక్కడకు రావచ్చును. నా విద్యార్థులకు నా ఇంటి తలుపు లెప్పుడూ తెరిచే ఉంటాయి. చదువుకే కాదు - ఆట పాటలకీ నిలయమే ఈ ప్రాంగణం."

"ఇప్పటికే చాలా పోగొట్టుకొన్నా ననిపిస్తూంది మాస్టారూ! నాకూ చదువుకోవాలని ఉంది."

సంభ్రమంతో చూస్తూ అతడి భుజం తట్టి - "అంతకంటే కావలసిం దేముంది? లక్షణంగా చదువుకోవచ్చు. నా సహకారం నీ కెప్పుడూ ఉంటుంది. రోజూ సాయంత్రం వేళల్లో వచ్చి ఓ గంట కూర్చుంటే చాలు" అన్నారు.

ఆ రాత్రి చాలాసేపు మాస్టారు, సమీర అతడిలో వచ్చిన మార్పు గురించే మాట్లాడుకొన్నారు.

అప్పటినుంచి శశాంక స్కూలు వదిలేక తప్పనిసరిగా మాస్టారి దగ్గరకు రావడం అలవాటు చేసుకొన్నాడు కాని చదువు ఒక పట్టాన వంటబట్టలేదు.

అప్పటివరకూ లక్ష్యం లేని గాలిపటంలా తిరిగిన అతడికి చదువుమీద దృష్టి కేంద్రీకరించడం కష్టమైంది. ఏకాగ్రత కుదరడం అసాధ్యమైంది.

మాస్టారు చాలా శ్రమ పడవలసి వచ్చింది.

సమీర కూడా తీరిక ఉన్నప్పుడు అతడితో పాటు కూర్చొని అర్థం కానివి చెబుతూ చదువుమీద ఆసక్తి కలిగించేందుకు ప్రయత్నించేది. క్రమంగా ఒక దారికి వచ్చేక, తనతో పోటీ పడేలా ప్రోత్సహించింది. ఇక పరీక్షల సమయంలో అయితే తిండీ, నిద్రా మరచి, చదువే ధ్యేయంగా పెట్టుకొని రాత్రీ పగలూ కష్టపడ్డారు.

ఆ సంవత్సరం శశాంక పాసవడం స్కూల్లోనూ, బయటా అందరినీ ఆశ్చర్యపరచింది. ప్రత్యేకించి శాంతమూర్తి మాస్టారిని అంత అభినందించేరు.

ఆ విజయం శశాంకలో ఒక అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగించడమే కాక ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పింది.

ఆ తరువాత అతడు చదువులో వెనకడుగు వేసింది లేదు. మాస్టారు, సమీర ప్రోత్సాహంతో వాళ్ళ అంచనాలనే మించిపోయాడు.

కొడుకులో వచ్చిన అద్భుతమైన మార్పుకు భూపతిగారు సంతోషంతో మాస్టారిని అభినందించారు.

"మా ఇంటి పరువు ప్రతిష్ఠలను నిలబెట్టిన మిమ్మల్ని మరచిపోలేను మాస్టారూ! మీ చేతుల్లో రూపుదిద్దుకొన్న మావాడిని చూస్తుంటే నాకే అద్భుతంగా ఉంది. మీ ఋణం తీర్చుకోవాలని కాదు కాని, ఏదో నా తృప్తి కొద్దీ ఇస్తున్నాను" అంటూ లాల్చీ జేబులో నుండి కొంత డబ్బు తీసి ఇవ్వబోయాడు.

మాస్టారు తీసుకోలేదు. "వద్దు భూపతిగారూ! శశాంక విషయంలో నాకు లభించిన ఈ సంతోషం, తృప్తి డబ్బు కంటే విలువైనది. దానికి వెలకట్టకండి" అంటూ తిరస్కరించారు.

శశాంక ఊళ్ళో చదువు పూర్తి చేసి పై చదువుల నిమిత్తం దూర ప్రాంతానికి వెళ్ళేటప్పుడు కూడా మాస్టారి సలహాను, సమీర ప్రోత్సాహాన్ని వెంట తీసుకొని వెళ్ళేవాడు. చదువే ధ్యేయంగా తలచి నిరంతరం శ్రమించాడు. మంచి ఫలితాన్ని సాధించాడు.

సానపట్టనిదే వజ్రమైనా ప్రకాశించ దన్నట్లు మాస్టారి శిక్షణలో శశాంక ఉన్నత విద్యావంతుడే కాక ఆ పల్లెకే ఒక గర్వకారకు డయ్యాడు.

అలాగే ఉద్యోగ ప్రయత్నాలు ఫలించి ప్రభుత్వ ఉన్నతాధికారిగా నియమితు డయ్యాడు.

ఆర్డర్సు తీసుకొని ముందుగా మాస్టారి దగ్గర కొచ్చాడు.

ఆయన పాదాల నంటి నమస్కరించి - "నా జీవితంలో వెలుగు దివ్వెను మీరే వెలిగించారు మాస్టారూ! ఎన్ని జన్మలకు మీ ఋణం తీర్చుకోగలను?" అన్నాడు చెమర్చిన కళ్ళతో.

సంతోషంతో అతడిని అక్కున చేర్చుకొంటూ - "నా బాధ్యత కంటే నీ కృషి, పట్టుదల గొప్పది శశాంకా! ఇటువంటి శిష్యుడిని పొందగలిగినందుకు నేను ఎప్పుడూ గర్వపడుతూనే ఉంటాను" అంటూ, సమీరను పిలిచి శశాంక ఉద్యోగం గురించి చెప్పారు.

సమీర కళ్ళలో మెరుపు.

"నీకు కాక ఎవరి కొస్తుం దీ ఉద్యోగం!" అంటూ ప్రశంసించింది.

"ఈ విజయం వెనక ఉన్న ప్రోత్సాహాన్ని నే నెన్నటికీ మరచిపోలేను సమీరా!" ఉద్వేగంతో అన్నాడు.

"ప్రోత్సాహంవలన ఇంత గుర్తింపు ఉంటుందంటే అందరినీ ప్రోత్సహించడమే పనిగా పెట్టుకొంటాను" అంటూ, నవ్వుతూ టీ తీసుకొచ్చేందుకు లోపలకు వెళ్ళింది.

ఆమె వెళ్ళినవైపే చూస్తూ నెమ్మదిగా అన్నాడు - "నా జీవితానికి మరో వరం కూడా మీరే ఇవ్వాలి మాస్టారూ!"

"ఏమి టది?" ఆశ్చర్యంతో చూశారు.

"ఇన్నాళ్ళూ మీ చేతి నందుకొని మీరు చూపిన బాటలోనే నడిచాను. ఇకపై జీవితాంతం సమీర నాకు తోడుగా ఉండాలి మాస్టారూ! నా చివరి అడుగు వరకూ తన చెయ్యి పట్టుకొని నడవాలని ఉంది."

నిర్విణ్ణు లయ్యారు!

ఎప్పటికప్పుడు శశాంక తను ఊహించని ఎత్తుకి ఎదిగిపోతూనే ఉన్నాడు. ఇప్పుడు మరీ ఉన్నతంగా అందుకోలేనంత శిఖరాలకు ఎదిగిపోయిన ట్లనిపించింది. తను భరించగలడా?

"వద్దు శశాంకా! మాలో లేనిపోని ఆశలు కలిగించకు. ఈ తృప్తి చాలు మాకు. ఇంతకు మించి కోరుకోవడం అత్యాశే అవుతుంది నాయనా!"

శశాంక దెబ్బతిన్న వాడిలా చూశాడు.

"మీరు నాటిన మొక్క ఇది. ఇప్పుడు మీ ప్రాంగణంలో ఉండతగదంటూ పెరికివేస్తా ననకండి. మనసులు పెనవేసుకొన్న ఈ బంధాన్ని విడదీసే ప్రయత్నం చెయ్యకండి. సంతోషంతో మమ్మల్ని ఆశీర్వదిస్తా రనుకొన్న తరుణంలో ఈ విముఖత్వం భరించలేను మాస్టారూ! ఈ జీవితానికి అన్నీ మీరే ఇచ్చారు. ఈ వరం కూడా మీరే ఇవ్వాలి!" వేడికోలుగా అన్నాడు.

చలించిన మాస్టారు కళ్ళు చెమ్మగిల్లగా ఆర్ద్రత నిండిన స్వరంతో - "తల్లి లేని పిల్ల అని ఏ లోటూ తెలియనివ్వకుండా అన్నీ నేనై గుండెలో పెట్టుకొని పెంచాను. ఇంత అపురూపంగా పెరిగిన నా తల్లి రేపు ఏ ఇంట కాలు మోపుతుందో, కట్టుకొన్నవాడు ఏ విధంగా చూసుకొంటాడోనని కలలో సైతం తల్లడిల్లుతుండే వాడిని. కాని నీ రూపంలో ఒక అదృష్టం తనకోసం దాగి ఉందని, అది తన

**ఇదేమిటి?**

"పండక్కి స్కూటర్ కొని పెట్టమని అడిగితే టేకు చెక్కలు పంపించా డేమిటీ మీ నాన్న?" తన భార్యను అడిగాడు ప్రకాష్.

"మా నాన్న ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడులెండి." చెప్పింది భార్య.

చల్లా మధుసూదనరావు
[చెవికానివారిపాతపల్లి]

జీవితాన్ని శోభాయమానంగా వెలిగించగలదని ఎన్నడూ ఊహించకపోవడం వింతగా ఉంది. కాని ఒక్కటే సంశయం. నీ గురించి మా కంటే ఎక్కువగా ఆలోచించగల నీ తల్లిదండ్రులకు నీ నిర్ణయం ఎంతవరకు సమ్మత మవుతుందనే నా ఆలోచన. వాళ్ళకు కాదని నీకై నువ్వు ఒక నిర్ణయానికి రావడం సమంజసం కాదు'' అన్నారు.

ఆ మాటతో శశాంక వదనం మబ్బు వీడిన చందమామలా ప్రకాశించింది.

''నా నిర్ణయాన్ని ఇంట్లో వాళ్ళు కాదనరు. పైగా నాన్నగారికి, అమ్మకు మీ పట్ల ఎంతో గౌరవ ముంది. సమీర కోడ లవుతుందంటే అంతకంటే వాళ్ళకు కావలసిన దేముంది?''

టీ కప్పులతో వచ్చిన సమీర ఎర్రబారిన చెక్కిళ్ళతో గుమ్మంలోనే నిలిచిపోయింది. శాంతమూర్తి మాస్టారు కూతురి దగ్గర కెళ్ళి ''నీకోసం ఇంత అదృష్టం దాగి ఉందని ఎప్పుడూ అనుకోలే దమ్మా!'' అంటూ శిరస్సు నిమిరి చేతిలో కప్పులు అందుకొన్నారు.

ఆ రాత్రంతా సమీరకు అద్భుతమైన కలలే. రాజకుమారి దుస్తుల్లో, చేతిలో వరమాలతో పూల పల్లకీలో పయనిస్తుంది. ఎప్పు డెప్పుడు ప్రియుని సాన్నిధ్యాన్నికి చేరుకొంటానా అన్న తహతహ గుండెల్ని మీటుతుంటే మధురోహలతో అలా రాత్రంతా పయనిస్తూనే ఉంది.

మాస్టారికైతే పొంగిపొరలే సంతోషంతో కంటిమీద కునుకే లేదు.

** ** **

స్కూలుకు బయలుదేరుతుండగా భూపతిగారు మాస్టారి ముంగిట్లో అడుగు పెట్టారు. ఎప్పటిలా ఒంటరిగా రాలేదు. వెంట మరో ఇద్ద రున్నారు.

ఆడపిల్ల తండ్రిగా హడావుడి పడుతూ ''రండి భూపతిగారూ! రండి'' అంటూ ఆహ్వానిస్తూనే అతడి ముఖకవళికలు చూసి క్షణం నిలబడిపోయారు.

ఎప్పుడూ గంభీరంగా ఉండే ఆ వదనంలో ఏదో కరుకుదనం, కళ్ళలో తీక్షణత.

కనుబొమలు ముడివేసి ముక్కు పుటా లదురుతుండగా కోపంతో - ''ఏమిటయ్యా పంతులూ! నాలు గక్షరం ముక్కలు నేర్పించి ప్రయోజకుణ్ణి చేస్తావని నీ దగ్గరకు పంపినందుకు, చివరకు నువ్వు చేసే నిర్వాకం ఇదా? నా బిడ్డను నీ అల్లుడిగా చేసుకొందామని ఆశపడతా వా? ఊళ్ళో నా కున్న పేరు ప్రతిష్ఠలు, పరువు మర్యాదలు చూసి కూడా ఇంతకు తెగించావంటే మావాడి అలుసు చూసుకొనే కదూ! పెద్దవాడివి, పిల్లలకు బుద్ధి చెప్పవలసింది పోయి ప్రోత్సహిస్తావా? నేను బతికి ఉండగా ను వ్వెన్ని పాట్లు పడినా అది జరగదు. ఇదిగో ఒక మాట! అంతస్తులు మరచి అందలం ఎక్కా లనుకోకుండా, తలకు మించిన ఆశలు పెట్టుకోకుండా తగ్గ సంబంధం చూసి కూతురి పెళ్ళి చెయ్. నీ ఋణం ఉంచుకోకుండా పెళ్ళి

### స్థిరాస్తి

బాగా డబ్బున్న భానుచందర్ని ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ ''మీకున్న స్థిరాస్తి ఏమిటో చెబుతా రా?'' అని అడిగాడు.

''పోయిన దసరా నుంచి మా ఇంట్లో తిష్ఠ వేసిన మా ఇంటల్లుడు.'' ఆ పీగా చెప్పాడు భానుచందర్.

కె. వెంకటరామ అక్కయ్య [పామర్రు]

కేదో సాయం చేస్తాను. అంతేకాని, ఇటువంటి ఆలోచన కలలో కూడా రానివ్వకు. నీకూ, నీ కూతురికీ కూడా క్షేమం కాదు'' అంటూ హెచ్చరించాడు.

హతాశుడయ్యాడు మాస్టారు. వెన్నుపూస విరిగిన ట్లనిపించింది.

వెంట వచ్చిన వాళ్ళు అవకాశం తీసుకొని నాలుగూ అన్నారు.

మరింత క్రుంగిపోయారు.

''పిల్లలకు పాఠాలు చెప్పుకోవలసినవాడివి. ఇటువంటి పనులు చేయడం తగదు. పిల్లకు పెళ్ళి చేసి పంపించు. నీ జీవితాని కే లోటూ రాకుండా మేం చూసుకుంటాం'' అంటూ వెళ్ళేందుకు ఉద్యుక్తు లయ్యారు.

మాస్టారు తెప్పరిల్లుకొన్నారు - ''భూపతిగారూ! ఒక మాట.''

ఏమి టన్నట్లు చూశారు.

''ప్రోత్సహించాలన్నా బుద్ధి చెప్పాలన్నా శశాంక ఇప్పుడు చిన్నవాడు కాదు. నలుగురికి చెప్పగల సమర్థుడు. పదిమందిని మెప్పించగల ప్రజ్ఞావంతుడు. అతడికి నేను చెప్పేటంత వాడిని కాను. ఇక మా విషయం అంటారా? వా ళ్ళిద్దరూ మనసులు ముడిపెట్టుకొన్నారని తప్పితే, కోరి మీ ఇంటికి కోడలిగా పంపడం నాకు మాత్రం సమ్మతమా? మీరు అంతస్తులు మాత్రమే చూడగలిగితే నేను ఆంతర్యాలు చూసి గాని విలువ కట్టలేను. మా అమ్మాయిని సంపన్న కుటుంబంలోకి పంపా లనుకోలేదు. సంస్కార హృదయుల మధ్య ఉండాలనే నా కోరిక. ఆ సంస్కారం శశాంక కుందనే వాళ్ళ వివాహానికి అంగీకరించాను. ఇక వెళ్ళొచ్చును.''

భూపతిగారి మొహం కందగడ్డలా మారగా, కళ్ళు చింతనిప్పులే అయ్యాయి - ''బతకలేని బడిపంతులుకి ఇంత అహంకారమా మావాడికి చదువు చెప్పావని కాని, అదే ఇంకొకరైతే ఈపాటికి తగిన శాస్తి జరిగి ఉండేది. భూమ్మీద నూకలు చెల్లిపోయి ఉండేవి. మావాడు మళ్ళీ ఎలా నీ గుమ్మం తొక్కుతా డో చూస్తాను'' అంటూ విసవిసా వెళ్ళిపోయారు.

రెక్కలు విరిగిన ట్లనిపించగా నిస్సత్తువతో కుర్చీలో కూలబడ్డారు.

కళ్ళ నిండుగా నీళ్ళు నిలువగా తండ్రి దగ్గరకు వచ్చింది సమీర.

''బాధపడకండి నాన్నా! డబ్బు అహంతో విర్రవీగే వ్యక్తుల చర్యలు ఇంతకంటే గొప్పగా ఉంటాయని ఎలా అనుకుంటాం?''

''సమీరా! మనం వేసే ప్రతి అడుగూ ఏ రాయో, ముల్లో గుచ్చుకొంటుందని చూసి మరీ వేస్తాం. జీవితంలో ఇంత ముఖ్యమైన నిర్ణయం తీసుకొనేటప్పుడు నువ్వు మరి కొంత ఆలోచించవలసిం దమ్మా!''

సమీర చలించిన ట్లయింది - ''నేను తీసుకొన్న నిర్ణయం తప్పని అనుకోవడంలేదు నాన్నా! నాకు శశాంక పట్ల ఎంతో నమ్మక ముంది. అతడి మనసు నాకు తెలుసు.

'అతడి గురించి కాదమ్మా! అతడి కన్న వాళ్ళ గురించి ఆలోచించవలసింది. ఎందుకంటే అతడి జీవితంలో వాళ్ళదే ప్రథమ స్థానం కనుక. ఆ హక్కుతోనే వా ళ్ళిప్పుడు ఏ అఘాయిత్యమో, ఆటంకమో తలపెట్టడానికైనా సిద్ధంగా ఉన్నారు.''

''లేదు, నాన్నా! నేను వాళ్ళ గురించి ఆలోచించలేదు. ఎన్ని అవరోధాలు ఎదురైనా శశాంక నన్ను చేపడతా డన్న నమ్మకం నా కుంది. ఎంద రడ్డుకొన్నా నా కోసం అత డొస్తాడు.'' తలవాకిట చూపు నిలిపి స్థిరంగా అంది.

మాస్టారు దీర్ఘంగా నిట్టూర్చారు.

** ** **

నిన్నటినుండి ఆగకుండా ఏకధారగా వర్షం కురుస్తూ ఉంది. అంతకంతకూ ఎక్కువవుతూ, హోరుమంటున్న గాలితో ప్రకృతి అంతా బీభత్సంగా మారిపోయింది. ఉన్నట్టుండి ఉరుములూ, మెరుపులతో ఆకాశం దద్దరిల్లుతుంది.

మాస్టారు శిలలా కూర్చున్నా మనసులో తుపాను కల్లోలం.

సమీర కయితే హృదయమంతా కురుస్తున్న ఆకాశంలా ఉంది.

గాలి విసురుకి, వాన బీభత్సానికి ఇంటి కప్పు చెదిరిపోవడంతో లోపల కూడా వర్షం పడుతోంది. మాస్టారు ఓ చెంప పూర్తిగా తడిసిపోయాక గాని ఈ లోకంలోకి రాలేదు.

''సమీరా! వర్షం ఉధృత మవుతోంది. ఎందుకైనా మంచిది, ఊళ్ళోకి వెళదామా! తెలిసిన వా ళ్ళింట్లో తలదాచుకోవచ్చు'' అన్నారు.

వద్దు నాన్నా! మనం ఎవరింటికో వెళితే శశాంక వస్తే ఎలా తెలుస్తుంది. అతడు వస్తాడనే నా నమ్మకం.''

ఘనను పిండినట్లవగా - ''పిచ్చితల్లీ! ఇటువంటి సమయంలో ఎవరైనా ఎలా వస్తారు? పద. ఏ అనర్థమూ జరక్కుండా బయట పడదాం!'' అన్నారు.

''వద్దు నాన్నా! ప్రాణం కంటే విలువైన ఆశ నా గుండె నిండుగా ఉంది. దాన్ని చంపుకొని రాలేను. కొద్దిసేపటికి ఈ వర్షం తగ్గిపోవచ్చు. అప్పుడు శశాంక రావచ్చు. మనం లేకుండా ఎలా?''

సంజ వెలుగు మాయమై చీకట్లు ముసురుకొన్నాయి.

మాస్టారు, సమీర వాన కురవని జానెడు చోటు చూసుకొని నిలబడ్డారు.

ఎందుకో అది మామూలు వర్షంలా అనిపించలేదు మాస్టారికి - లోకాన్ని ముంచెత్తడాని కొచ్చిన ప్రళయంలా అనిపించింది.

హోరుమంటున్న గాలి, ఫెళ ఫెళ మంటూ

తిరుగుతున్న చెట్లు గుండెల్లో బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.

కాళ్ళ కింద చల్లగా పాకుతూ వచ్చిన నీటిని చూసి ఉలిక్కిపడ్డా రిద్దరూ.

క్షణక్షణానికి ఎక్కు వవడం గమనించి భయవిహ్వాలు లయ్యారు.

"వర దొస్తున్నట్లుంది" అంటూ, గబగబా పెట్టెలు ఒక చోట చేర్చి ఒక దానిమీద ఒకటి పెట్టి నిలబడ్డారు. అప్పటికే పైనుండి కురుస్తున్న వానకు తడిసిపోయారు.

నమీరకు దుఃఖం ముంచుకొచ్చింది - "నాన్నా! నన్ను కన్నందుకు మిమ్మల్ని మీరు నిందించుకుంటున్నారేమో కదూ?"

మాస్టారి హృదయం విలవిల లాడింది. "ఎంత మా టన్నా వమ్మా! నిన్నటివరకు ఎంతో అదృష్టవంతురాలివని మురిసిపోయాను. కాని దురదృష్టం నానుండే వచ్చిందని తెలుసుకోలేకపోయాను" అంటూ, కూతురి శిరస్సును గుండె కానించుకొన్నారు.

"వద్దు నాన్నా! ఏ అదృష్టం నా కొద్దు. అది మీ బడికంటే సౌభాగ్యవంతమైనది కాదు. ఇలా ఉండిపోనివ్వండి. ఈ అదృష్టంచా లీ జన్మకు."

వానతో పాటు ఇంట్లో నీటి మట్టం పెరగసాగింది.

మాస్టారు నిబ్బరం తెచ్చుకొన్నారు. "భయపడుతున్నావా నమీరా! వర్షం తగ్గితే నీరు తీసేస్తుంది క్షణంలో. ఏ భయం లేదు" అన్నారు.

నీటి ధారలు మొహంమీద నుండి జాలువారుతుంటే వల్పగా నవ్వింది - "మీ రుండగా భయ మేమిటి నాన్నా! యముడితోనైనా పోరాడి నన్ను కాపాడుకుంటారు."

ఫెళపెళమంటూ చెట్టు విరిగిపడటంతో కుటీరంలో కొంత భాగం కూలిపోయింది. భయంతో తండ్రిని హత్తుకుపోయింది. వెన్ను నిమురుతూ ధైర్యం చెబుతున్నారు మాస్టారు.

ఉన్నట్లుండి మెరుపు మెరిసినప్పుడూ చుట్టూ నీరే కనిపిస్తూ భయాన్ని పుట్టిస్తూంది. అక్క డొక ఇల్లు, అక్క డొక ఇల్లు విసిరినట్లుండటంతో జనం అలజడి ఏదీ వినిపించడం లేదు కనిపించడం లేదు.

కాని ఏ క్షణంలోనైనా ఎవరైనా వచ్చి రక్షించవచ్చుననే ఒక చిరు ఆశ వాళ్ళ నింకా అలాగే నిలబెట్టింది.

హఠాత్తుగా ఎవరో లోపలికి జొరబడిన ట్లనిపించడంతో ఇద్దరిలోనూ చలన మొచ్చింది.

"ఎవరూ? ఎవరది?" మాస్టారు గట్టిగా అరిచారు.

"మాస్టారూ!"

ఆ పిలుపు జీవం పోసిన ట్లనిపించగా ఒక్కసారిగా "శశాంకా!" అంటూ అరిచారు. మునిగిపోయేవాళ్ళకు పెద్ద ఆధారం దొరికినట్లయింది.

నీళ్ళలో ఈదుకొంటూ నడుస్తూ వాళ్ళను నమీపించాడు.

"ఏమిటి మాస్టారూ! ప్రకృతి అంత ఇంత బీభత్సంగా ఉంటే మీ రింకా ఇక్కడే ఉన్నారు."

"నీకోసం శశాంకా! ను వ్వొస్తావనే ఆశతోనే ఉన్నాము. మా ఆశ నువ్వు వమ్ము చెయ్యలేదు." నమీర అతడి చెయ్యి పట్టుకొని అంది.

"ఇంకా ఇక్కడ ఉండటం క్షేమం కాదు. పదండి" అంటూ, వా ళ్ళిద్దరినీ చెరో నందిట బలంగా పట్టుకొని మొలలోతు నీళ్ళలో ఈదుకొంటూ నడవసాగాడు. చుట్టూ అంధకారమే. పైగా జోరున వర్షం.

"శశాంకా! ఒక్క మాట చెప్పు. మన వివాహానికి మీ పెద్దవాళ్ళు ఒప్పుకొన్నారా?"

"వాళ్ళను ఒప్పించే వచ్చాను."

నమీరకు వరదే కాదు, ఉప్పెనైనా ఎదుర్కొనే శక్తి వచ్చినట్లనిపించింది.

మాస్టారికి నూరేళ్ళూ బతకాలనే ఆశ కలిగింది.

ప్రెసిడెంటుగారి మేడ లోగిట్లో కొచ్చారు.

తుపానుకు భయపడి తల దాచుకోడాని కొచ్చిన మరి కొంతమంది అక్కడే ఉన్నారు.

"మాస్టారూ! ఇంకా వరద నీటిలో చిక్కుకుపోయిన వారిని రక్షించవలసి ఉంది. మీరు జాగ్రత్తగా ఉండండి" అంటూ వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు.

"ఇంత గాలీ వానలోనా! వద్దు శశాంకా! ఉండిపో!" నమీర అభ్యర్థించింది.

నవ్వుతూ - "ఈత వచ్చినవాడిని నాకు భయమేమిటి నమీరా!" అన్నాడు.

"నాన్నగా రెక్కడ శశాంకా!"

"మేడమీ దున్నారు. కిందంతా వరద బాధితులకు కేటాయించారు. మీరూ వెళ్ళండి మాస్టారూ!"

"అవసరం లేదు. అయినా ఇటువంటి పరిస్థితిలో నువ్వు బయటకు వెళ్ళట మేమిటి! మీ పెద్దవాళ్ళు ఆందోళన పడతారు. వద్దు శశాంకా!"

"నాకేం ఫరవాలేదు మాస్టారూ!" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

నమీర భయంతో గుండె చిక్కబట్టుకొని చూస్తుండిపోయింది.

శశాంక ఓ గంటకి వరదలో చిక్కుకున్న కొంతమందిని రక్షించి తీసుకొచ్చి మాస్టారు వారిస్తున్నా వినకుండా మళ్ళీ బయలుదేరాడు.

"వద్దు శశాంకా! వరద నీరు పెరిగింది. ఈ పరిస్థితిలో నువ్వు వెళ్ళడం క్షేమం కాదు."

"పరవాలేదు మాస్టారూ! ఈత వచ్చినవాడిని. నాకు భయమేమిటి? ఆపదలో ఉన్న వాళ్ళను రక్షించడం మానవ కర్తవ్యం అన్నారు మీరే. పరులకు ఉపయోగపడటంలోనే పరమార్థం ఉం దన్నారు. స్వార్థంతో కూడిన బతుకు హేయమైందని కూడా చెప్పారు. అవన్నీ నేను మరచిపోలేదు మాస్టారూ! ఇటువంటి పరిస్థితిలో పదిమందిని రక్షించడం కంటే గొప్ప కార్యం అనలే లేదు. వెళ్ళనివ్వండి" అంటూ, జోరున కురుస్తున్న వానలో, చీకట్లో కలసిపోయాడు - మాస్టారు వారిస్తున్నా నమీర కన్నీళ్ళతో అర్థిస్తున్నా వినకుండా.

కొడుకు కోసం కిందికి దిగి వచ్చిన ప్రెసిడెంటుగారు జరిగింది తెలుసుకొంటూనే కంగారుపడ్డారు. నౌకర్లని పిలిచి కేకలు వేస్తూ - "చినబాబుని ఎలా వెళ్ళనిచ్చార్రా! వెళ్ళండి. వెతికి తీసుకురండి. వరదలో చిక్కుకుపోయిన వాళ్ళను రక్షించాలంటే గజ ఈతగాళ్ళను పిలిపించండి. అంతేకాని బాబును వెళ్ళనివ్వద్దు. ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా ముందు బాబును తీసుకురండి" అంటూ కేకలు పెడుతూ తరిమి కొట్టారు.

మాస్టారు ప్రెసిడెంటుగారి దగ్గర కొచ్చి - "శశాంక ఎంత చెప్పినా విన్నాడు కాదు భూపతిగారూ! పైగా మమ్మల్ని రక్షించటానికి వచ్చినప్పుడే వరద నీరు ఉధృతమయింది. ఇప్పు డింకా పెరిగి ప్రమాదస్థితిలో ఉంటుందన్నా వినిపించుకున్నాడు కాదు. ఎన్నడూ చూడని ఆ మొండి వైఖరి ఏమిటో నా కర్థం కావటం లేదు" అన్నారు బాధగా.

మాస్టారిని చూస్తూనే ప్రెసిడెంటుగారు కోపోద్రేక్తు లయ్యారు - "అసలు మావాడు బయటకు రావటానికి కారణం మీరే. మీ పిల్లను పెళ్ళి చేసుకొంటానని పట్టుబడితే, వా ళ్ళమ్మా, నేను ఏ విషమో తాగి చస్తామనీ విషం సీసా దగ్గర పెట్టుకొని గుమ్మంలోనే కూర్చున్నాం. చివరకు ఈ తుపాను బీభత్సంలో మిమ్మల్ని రక్షించటానికి బయలుదేరాడు. అందుకూ ఒప్పుకోలేదు. చివరకు మీ అమ్మాయిని పెళ్ళాడనని మాట ఇస్తే మిమ్మల్ని రక్షించటానికి ఎవరినైనా పంపుతున్నాను. అలాగే ఈ పెళ్ళి చేసుకోనని మాట ఇచ్చి మిమ్మల్ని తీసుకొచ్చేందుకు తనే బయలుదేరాడు. కాని ఇప్పు డింకా ఎవరికోసం ఈ వరదలోకి వెళ్ళడం? మిమ్మల్ని తీసుకొచ్చాకైనా ఆగిపోవచ్చుగా?"

మాస్టారు నిర్ఘాంతపోయారు.

నమీర కళ్ళు తిరిగిన ట్లనిపించగా గోడకు చేరగిలబడింది.

ఎవరో పెద్దగా అరుస్తూ లోపలికి జొరబడ్డారు.

"బాబుగారో! గోరం జరిగిపోనాదండీ! వరదలో చిక్కుకుపోయిన మా సిన్నోడ్ని రచ్చించబోయి తనే కొట్టుకుపోయాడండీ సినబాబు. మావోడ్ని రచ్చించి తను బలైపోనాడండీ!"

ఒక్కసారిగా ప్రెసిడెంటుగారి భవంతి అంతా ఘొల్లుమన్న ఏడ్పులతో అరుపులతో మారుమ్రోగిపోయింది.

భూపతిగారూ, ఆయన భార్యా గుండెలు బాదుకొంటూ బయటకు పరుగెత్తబోతుంటే ఎవరో బలంగా ఆపి అంటున్నారు - "ప్రకృతి విపరీతం ఎలా ఉందో చూడండి! అడుగు పెట్టలేని పరిస్థితి!"

మాస్టారికి స్పృహ తప్పుతున్నట్లుగా ఉంది. ఆ పరిస్థితిలో కూడా ఒక్కటే ఆలోచన...

ప్రకృతి వైపరీత్యాలను అరికట్టలేకపోవచ్చును కాని మానవ వైపరీత్యాలను ఎప్పటికీ అరికట్టలేమా?

★

జడ్జి రామజోగారావు పిప్పి పంటి బాధ భరించలేక దాన్ని పీకించుకోటానికి దంత వైద్యుడి దగ్గర కెళ్ళాడు. డాక్టరు పన్ను పీకడానికి సిద్ధపడుతుంటే, "ఆగండి! 'పాడైన పన్ను మాత్రమే పీకుతాను. మరి ఏ ఇతర పంటి జోలికి పోను' అని ముందు ప్రమాణం చేయండి" అన్నాడు జడ్జి అలవాటు ప్రకారం.

కె. వెంకటరామ అక్కయ్య [పామర్రు]